# సాయినా పులి!

-డాక్టర్ దేవరాజు మహారాజు




నేషనల్ జియోగ్రఫీ ఛానెల్‌లో నా మనుమలు అఖిల్, సమీర్‌లు పులుల్ని చూస్తున్నారు...

పులి అడుగులో అడుగు వేసుకుంటూ మెల్లగా ముందు కొచ్చింది. తమ గుంపులోంచి కొంచెం పక్కకు తప్పుకున్న జింక మీద పులి కన్నేసింది. ముందుకు దూకింది–

తన వెనక క్రూర మృగమేదో మసలుతోందని జింక పసిగట్టింది. చెంగు చెంగుమని గెంతుతూ తన గుంపువైపు పరుగుదీసింది–

పులి వేగంగా అడ్డం తిరిగింది. జింకను తన గుంపులో చేరకుండా చేసింది. దారి మళ్ళించింది. ఒంటరిదాన్ని చేసింది–

ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని, భయంతో కంపిస్తూ చివరి నిముషం వరకు జింక పరుగెడుతూనే ఉంది–

పులి జింకను వేటాడుతూ, వేటాడుతూ చివరికి పంజా విసిరింది–

అమాయకంగా, అసహాయంగా, అన్యాయంగా జింక కూలబడింది.

టి.వి. తెరమీద వ్యాపార ప్రకటనలు మొదలయ్యాయి. పిల్లలు ఛానెల్ మార్చారు. నాకు మా బాల్యం గుర్తుకొచ్చింది. నిజాం రాజ్యంలో తెలంగాణ ప్రజలు గుర్తుకొచ్చారు. రజాకార్ల ఆగడాలు పులి వేటకన్నా తక్కువ కాదు.

***

ఆ రోజుల్లో కరువు కాటకాలు ఒకవైపు, అరాచకత్వం, దోపిడీ మరోవైపు, తలుచుకుంటేనే గుండె దడదడలాడుతుంది. కుల పట్టింపులు, నిరక్షరాస్యత, పెత్తందార్ల రాక్షసత్వం ఒకటేమిటి? తెలంగాణలో ప్రజా జీవనం అస్తవ్యస్తంగా ఉంది.

అప్పుడు నాకు పదేళ్ళు–

సమాజ స్వరూపం అంతగా తెలియని చిన్నతనం. వాగులూ వంకలూ పట్టుకు తిరిగే వయసు. పసివాణ్ణి గనక, ఇంట్లో బయటా అందరూ ముద్దుచేసేవారు. ఒకసారి అమ్మా, నాన్నలతో కలిసి మా మేనమామ ఇంటికి వెళుతున్నాను. బండి ప్రయాణం. కోడెగిత్తలు వేగంగా పరిగెడుతున్నాయి. నాకు భలే సరదాగా ఉంది. వాగులో బండి నడుస్తున్నప్పుడు నీటి గలగల, బండి చక్రం కింద నలుగుతున్న ఇసుక చప్పుడూ కలిసి వింతగా తోచాయి. “చీకటి పడింది కదా! ఏ బావి దగ్గరైనా ఆగుదాం” అన్నారు మా నాయన వెంకటయ్య గారు.

“అట్లనే తీయుండ్రి ఆగుదాం”– అన్నాడు మా బండి వాడు సాయిలు.

ఇంతలో దూరంలో ఏదో అరుపు వినిపించింది. పెద్దవాళ్ళందరూ బిత్తరపోయి ముఖాలు చూసుకున్నారు. నాకు ఏమీ అర్థం కాలేదు. కోడెలు టక్కుమని ఆగిపొయ్యాయి.

“అయ్యా! దరిదాపులల్ల పులి తిరుగుతాంది. మనం బతికి బయటపడితే అదృష్టవంతులం” అన్నాడు సాయిలు.

"ఊ. భయం లేదులే సాయిలు. తుపాకి తెచ్చాను" – అన్నారు మా నాయనగారు. బింకంగా ఆ మాట అన్నారే గానీ, ఆయన ముఖంలో ఆందోళన కనిపిస్తూనే ఉంది. మా అమ్మ చేతులెత్తి దేవుళ్ళకు మొక్కుకుంది. నన్ను ఒళ్ళోకి లాక్కుంది. "ఏం ఫరవాలేదు. ధైర్యంగా ఉండు అన్నట్టు" – నాయనగారు అమ్మ భుజం తట్టారు. బండి దిగి, తుపాకి సరిచేసుకున్నారు. శ్వాస చప్పుడు, మధ్య మధ్య కిర్రుమంటున్న బండి ఇరుసు చప్పుడూ తప్ప, మరో శబ్దం లేదు. పది నిముషాలు గడిచాయి. ఇరవై నిముషాలు గడిచాయి – కోడెలు చెవులు నిక్కబొడుచుకుని, అటూ ఇటూ చూశాయి. మరో ఐదు నిముషాల తర్వాత సాయిలు కిందికి దూకి లాంతరు పట్టుకుని, ముందు నడిచాడు. నాయనగారు బండెక్కి పగ్గాలు పట్టుకున్నారు. పడుకోమని అమ్మ జో కొడుతున్నా నాకు నిద్రపట్టలేదు. పులి ఎక్కడి నుంచి వస్తుందోనని నాకు భయం భయంగా ఉంది. మరోవైపు పులిని చూడాలని కూడా ఉంది.

చీకట్లో అలా కొంత దూరం ప్రయాణించాక మనుషుల అలికిడి వినిపించింది. బండిలో వస్తున్నది వెంకటయ్యగారి కుటుంబమని సాయిలు చెప్పగానే బావుల వాళ్ళు ఎదురొచ్చారు. ఆ రాత్రికి అక్కడే ఆగిపొమ్మన్నారు. నులక మంచాలు తెచ్చి వేశారు. ఒకరు మంచినీళ్ళు, మరొకరు పాలూ తెచ్చి పెట్టారు. అమ్మ పొట్టలో మొహంపెట్టి నిద్ర పోయిన నాకు ఆ తర్వాత ఏదీ గుర్తులేదు.

మరునాటి ఉదయం తెల్లవారాక లేచి చూస్తే – కొత్త ప్రదేశం, కొత్త వాతావరణం, కొత్త ముఖాలు..! నాయనగారు నులక మంచం మీద కూర్చుని మొహం పుల్లతో పళ్ళు తోముకుంటున్నారు. గొంగడి ముసుగు పెట్టుకుని, గడ్డి వాముకు ఆనుకుని, కూర్చున్న వృద్ధుడితో మాట్లాడుతున్నారు. అతగాడికి చెవుడేమో – నాయనగారు అడిగిందే మళ్ళీ మళ్ళీ గొంతు పెంచి అడుగుతున్నారు. ఆ ముసలతను అయోమయంగా చూస్తూ... జవాబు చెపుతున్నాడు.

"కాదు, కాదూ – నీకూ – ఇప్పుడెన్నేళ్ళని అడుగుతున్నా" గొంతు చించుకున్నారు నాయనగారు.

"నాకా?" అని, తెలియదన్నట్లు గాలిలో చేతులు తిప్పాడు వృద్ధుడు. కాసేపటికి "మహబూబలి రాజు కాలంల గింతోణ్ణి" –అని చెయ్యెత్తి చూపాడు.

"నీకు తెలుసా రాజు?"

"అప్పుడు గీ ఊళ్ళెక్కడియి? గీ జనం ఎక్కడిది? రాజు షికారుకు ఒస్తాండంటె – ఎక్కడ నాలుగు గుడిసెలుంటె అక్కడ, మానవ పురుగు లేకుండ తొలుకపొయ్యెటోళ్ళు."

"మా తాత పులుల యాట గురించి చాన బాగ జెప్తడుండె" అన్నాడు ఆ వృద్ధుడి మనవడు, ఆ పక్కనే మోటగొడుతూ. నేను మోటబావి దగ్గరికి వెళతానన్నాను. అమ్మ వారించి కూర్చోపెట్టింది.

" ఏం పెద్దమనిషీ! పులి వేటకు పోయినావా? ధైర్యవంతుడివే" – అన్నారు నాయినగారు.

ఆ విషయం నాకు నమ్మబుద్ధి కాలేదు. అమ్మను అడిగాను. "అమ్మా! ఈయన పులిని చంపేశాడా?" గుక్క తిప్పుకోకుండా రెండు, మూడుసార్లు అడిగాను. దుప్పటి మడత పెడుతున్న అమ్మ "నాకేం తెలుసురా! అతనేం చెబుతాడో వినూ" –అని అంది.

".....పుట్టి పెరిగింది అడవుల మధ్యనే. బతికేది పులుల మధ్యనే. అయినాగాని, పులినిజూస్తే దిగులు దిగులు... బుగులు బుగులు. పులంటే చావు. మృత్యువుకు ప్రత్యక్ష రూపం. అసోంటి మృత్యువును కవ్వించడమంటే, ఎంత లావటోళ్ళకైనా గని, లోపట్లోపల భయంగా ఉండేది. కని, రాజాజ్ఞగదా! తిరుగుంటదా?"

" ఆ! ఆ! పులినీ... ఎట్లా కొట్టేవారూ?" బాగా గొంతు పెంచి అడిగారు మా నాయనగారు.

"డప్పులు గొట్టెటోళ్ళం. కొమ్ములు, గంటలు, మువ్వలు అన్ని – కొట్టి కొట్టి, అడివంత కవిలిపోయెటట్టు సందడి జేసెటోళ్ళం. అప్పుడప్పుడు పులి చిరాకుపడి అట్టహాసంగా వస్తున్న జనం మీదికి, రౌద్రాకారం తోటి ఎదురు తిరిగేది. ఆకాశమంటుకోని ఒచ్చే జనఘోష ఒక్క నిమిషంల నీటి బుడగోలె ఇచ్చుకు పోయేది. గ్రామ జనం ప్రాణాలు గుప్పిట్ల పెట్టుకోని చెట్టుకోదు పుట్టకోదు పారిపొయ్యెటోళ్లు. పరిస్థితులు భయోత్పాతం కలిగించేయి. అయినా అందులో కొంచెం ఆనందం గూడా ఉండేది. రాజు షికారు జరిగినప్పుడల్లా జనానికి పైసలు బహుమానంగా దొరికేది. చేతిల బడ్డ ఆ పైసలు బంగారి

## చివరి స్నానం



–నందిని సిధారెడ్డి

చివరిస్నానం చేయించటానిక్కూడా నీళ్ళు దొరకవు
శవానికయినా అదృష్టముండాలి
ఏడవటానికెవరూ ఉండరు
రాజ్యం కాని రాజ్యం
బత్కవొయిన కొడుకులు ఏ చావు చస్తున్నారో...
శవమైనందుకేడువాలో
కానందుకేడువాలో
బొంతలకేల్లి లెవ్వలేని ముసలవ్వకర్థం కాదు
ఒక్క దినమైనా
సత్తుగిన్నెలో పొద్దుపొడువది
కడుపు కాల్చటానికి దాపురించిన దొరలు
తనువు కాల్చటానికి రారు
ఊచకోతకన్నా బాంబు దాడికన్నా
కటువైన ఈ హత్యలకు కేసుల్లేవు
ఉన్నవన్నీ కఠోర నిర్ణయాలే.
అంతా ఇప్పటికిప్పుడు జరిగిందేంకాదు
జల్లెడ జల్లెడయి భూమి రోదించినప్పటి మాట
బాటిల్లల్ల బందీ అయి నీరు అల్లాడినప్పటి మాట
మనిషంతా సరుకై రోడ్డుమీద పర్చుకున్నప్పటి మాట
పాలకుల నవనీతిని పత్రికల మడతల కింద దాచినప్పటి మాట
ఏదీ ఇప్పటికిప్పుడు జరిగిందేం కాదు
మబ్బులు భయపడి
పిలిచినా వినిపించుకోవు

సిరికాంచె చెట్టూ సీతాఫలం చెట్టూ
చిగిర్చటం ఆపేస్తాయ్
దాహంతో అల్లాడే కాకి
తిర్గి తిర్గి ఎక్కడా కడవ కనిపించక
బోరు పంపు ముందట
పానశరం పడుతుంది
ప్రేమలు ఎండిపోయిన చోట
పచ్చిక కూడా మొలువది
సాదలేక కొతకమ్మలేక రైతు యాతన చూడలేం
మనిషయినా పశువుకయినా రాతుండాలి
వెనుకటికి బ్రహ్మరాతే తెలుసుకోలేదు
బహుళజాతి రాతలేం తెలుస్తాయి?
తాళాలు వేసి తరలివెళ్లుతున్న కుటుంబాన్ని చూసి
ఇల్లు బెంగటిల్లుతుంది
కప్పు మీంచి ఒక పెంక పగిలి కిందపడుతుంది
ఖాళీ అవుతున్న వాడలు చూసి కుక్కలు ఏడుస్తాయి
జన్మజన్మల ఆత్మీయత పుటుక్కుమన్నందుకు
ఊరు పెద్దగా మూలుగుతుంది
ఎందుకిట్లా అయిందని
ఊరు కుతకుత ఉడుకుతున్నది
ఎక్కడ మీటితే ఏది తెగిందో
ఏది గుంజితే ఏది కదుల్తుందో
ఊరు ఆలోచన్ల పడ్డది

కాసుల్లాగా అనిపించేవి. ఎందుకంటే... మేం వాటిని ప్రాణంగ దాచుకొనెటోళ్ళం. ఎవరైనా బంధువులొస్తే, గాదె అడుగున దాసుకున్న పైసలు దీసి గొప్పగ జూపెట్టెటోళ్ళం. వాళ్ళు వాటిని వింతగ జూసి, మెచ్చుకోలుగ జూసెటోళ్ళు..." ఆ వృద్ధుడు అనేక విషయాలు చెప్పాడు. నాయనగారే శ్రద్ధగా వింటున్నారంటే అతను చెప్పే విషయాలేవో విలువైనవేనని అమ్మ నాకు చెప్పింది. చదువుకున్న వాడిగా అతనికి ఆ రోజుల్లో ఎంతో గౌరవ ముండేదట. చిన్న వాడిని. నాకు ఆ విషయాలు మీద ఆసక్తేం ఉంటుంది? వెంటనే మామయ్య ఇంటి ముంగిట వాలిపోవాలని, అమ్మమ్మకు కబుర్లు చెప్పాలనీ అనిపించింది. అందుకే అక్కడి నుండి లేచి బండెక్కాను. సాయిలు కోడె గిత్తల్ని బండికి కట్టి ప్రయాణానికి సిద్ధం చేశాడు.

***

పిల్లలు ఛానెల్ మార్చారు. మళ్ళీ జియోగ్రాఫిక్ ఛానెల్. టి..వి. తెరమీద దర్శనమిచ్చింది. నా బాల్యం లోంచి మళ్ళీ ఈ కాలానికి వచ్చాను–

టి.వి. తెరమీద పులుల కార్యక్రమం ఇంకా సాగుతోంది– పులులకు కొద్ది దూరంలో జీపు ఆగింది. జీపులోంచి ఓ బలిష్టమైన వ్యక్తి కిందకి దిగాడు. కెమెరా తీసుకుని, పులుల్ని ఫొటోలు తీస్తున్నాడు. నేపథ్యంలో ఇంగ్లీషు వ్యాఖ్యానం నడుస్తోంది.

"ఆ పులి మీదికి దూకిందంటే వీడి పని ఖాళీ" – అని అన్నాడు అఖిల్.

"అరె పిచ్చోడా! దూకితే ఏం చేయాలనేది వాళ్ళకు తెలుసు. అంతా సిద్ధపడే వెళతారయ్యా" – అన్నాడు సమీర్. నా మనుమల సంభాషణ వింటుంటే నాకు ఏ రక్షణా లేని నాటి పేదప్రజానీకం గుర్తుకొచ్చారు. ముఖ్యంగా తహసిల్‌దారుగా నేను ఉద్యోగంలో చేరిన కొత్తలో ఎదురైన రామయ్య విషాదగాథ మరువలేనిది. గుర్తొచ్చినపుడల్లా మనసు కలుక్కుమంటుంది.

***

"నిజాం రాజ్యంలో అవి కొత్తగా రైలుపడ్డ రోజులు– రాజు పట్టణం వస్తున్నాడని, ఆయన భద్రత కోసం, ఊరి జనాన్ని స్తంభానికి ఒకడిగా రైలుకట్ట పొడుగునా, కావలి పెట్టారు. ఆ సందర్భంలో ఒక గ్రామంలోని ఒక పదేళ్ళ కుర్రవాడిని తీసుకుపోయారు. సమయానికి వాడి తండ్రి లేని కారణంగా వీణ్ణి తీసుకుపోయి స్తంభాల కావలి పెట్టారు. పొరుగు గ్రామాన్నించి అప్పుడే తిరిగొచ్చిన తండ్రి, తన పిల్లవాడి పరిస్థితి తెలుసుకుని, ఆందోళనగా రైలుకట్ట దగ్గరికి పరుగెత్తుకొచ్చాడు. కాని అధికారులు వాడి కొడుకు పక్కనే మరో స్తంభానికి కాపలా పెట్టి 'జాగ్రత్త' అని హెచ్చరించి పోయారు.

"అయ్యా నీవేనా?" దూరం నుండి చూసిన కొడుకు ఆతురతగా కూత వేశాడు. పక్క స్థంభం నుండి–

"నేనే కొడుకా!" అన్నాడు తండ్రి.

"నీ దగ్గరికి రానా?" అడిగాడు కొడుకు

"వద్దు కొడుకా!" అని వారించాడు తండ్రి.

" ఒక్కసారి వస్తా"

"వద్దు కొడుకా"

"చాన సేపు ఏమి ఉండ"

"వద్దు కొడుకా"

"ఊరికె వచ్చి మల్ల నా జాగల నిలబడతా"

"వద్దుర కొడుకా. సర్కారు హుకుం"

"నాకు భయమైతాందే"

"నేనిక్కడ ఉన్నగదర బిడ్డా!"

"ఇక్కడ చెట్లు గుంపుగున్నయే"

"ఇక్కడ లేవా?"

"చెట్లల్ల చప్పుడయితాంది"

"ఏం చప్పుడు?"

" ఏందో కదుల్తాంది. నీవురా!"

" ఏహే–గాలి!"

" ఏదో మెల్లెమెల్లగ నడుస్తాంది"

"ఏం లేదు తీయ్"

"నీ దగ్గరి కొస్తా"

"పోలీసు చూస్తది"

"నాకు ఎట్లనో అయితాంది" కొడుకు దీనత్వం.

"ఏమి లేదులే భయపడకు" తండ్రి బుజ్జగింపు.

ఇంతలో హఠాత్తుగా "ఓ అయ్యా! ఓ అయ్యా!!" అనే కేకలు వినిపించాయి. దిక్కులు పిక్కటిల్లాయి. రామయ్య భయంతో కొడుకు దిశగా పరుగెత్తాడు. కొడుకు స్తంభం ఖాళీగా కనిపించింది.

" ఓ అయ్యా! ఓ అయ్యా!!" అనే కేకలు అరణ్యగర్భం లోంచి వినిపించడము, "నా కొడుకును పులి ఎత్తుకు పోతున్నది సర్కార్!" అని రామయ్య బేలగా బోరుమనడం ఒక్క తృటిలో జరిగిపొయ్యాయి. కేకలు విని, ఇతర స్తంభాల వాళ్ళు పరుగెత్తుకొచ్చారు. అధికారులతో సహా అందరూ రామయ్య వెనక అడవిలోకి పరుగెత్తారు.

రామయ్య తన వెనక ఏమి జరుగుతున్నదో గమనించే స్థితిలో లేడు. "ఓ అయ్యా! ఓ అయ్యా!!" అనే కేకలు వినిపించిన వైపు పరుగెత్తాడు.

"వస్తాన కొడుకా! వస్తాన కొడుకా" అని దుఃఖంతో అరుస్తూ అడవిలోకి చొచ్చుకుపోయాడు. అట్లా కొంతదూరం పరుగెత్తాడో లేదో, పిల్లవాడి దీనాలాపాలు ఆగిపొయ్యాయి.

ఆ పగలంతా కుర్రవాడి కోసరం ఊరి జనం చెట్టు, పుట్ట గాలించారు. కాని కుర్రవాడి జాడ ఎక్కడా కనిపించలేదు. హతాశులై మరునాడు తిరిగి వద్దామని రామయ్యను ఆ రాత్రి ఇంటి దిశగా మళ్ళించుకపోయారు. ఆ తర్వాత రామయ్య, రామయ్య బంధువర్గం కొన్ని రోజులపాటు పిల్లవాడి కోసం అడవి గాలించారు. కాని వాళ్ళ ప్రయత్నాలు ఫలించలేదు. ఆనవాలు కూడా దొరకలేదు.

ఇది జరిగిన కొన్ని రోజులకు నేను ఆ గ్రామం 'దౌరా' వెళ్ళాను–

జమాబంది జరుగుతోంది. నాతోపాటే నాకింది పేష్కార్లు, సేకెదార్లూ ఉన్నారు. పని ముమ్మరంగా సాగుతోంది. పటేల్ పట్వారీలు మంచి ఇంతెజామ్‌లు చేశారు. అదే రామయ్యను ఆరోజు చావడిలో వంట సామానుల దగ్గర కావలి పెట్టారు.

అర్ధరాత్రివేళ రామయ్య లేచి "వస్తాన కొడుకా! వస్తాన కొడుకా!!" అని అరిచాడు. మరికొంత సేపు రాత్రి నిశ్శబ్దంలోకి చూస్తూ కూర్చున్నాడు. మళ్ళీ అరవడం... మళ్ళీ చీకట్లో కూర్చోవడం చేశాడు. నాకు మెలకువ వచ్చి విషయమేమిటని వాకబు చేశాను. కావలి పడుకున్న మస్కూరి వాళ్ళు రామయ్య విషాదగాథ చెప్పారు. ఇక ఆ రాత్రంతా విషాద వాతావరణం ఏర్పడింది. మరునాడు ఉదయం గ్రామస్థులు కూడా రామయ్య కొడుకు విషాద మరణం గూర్చి చెప్పారు. "వస్తాన కొడుకా! వస్తాన కొడుకా!!" అని రామయ్య అప్పుడప్పుడూ పిచ్చిగా అరుస్తుంటాడని, ఓ పూట గడిచాక మళ్ళీ మామూలు స్థితికి వస్తుంటాడని చెప్పారు. తహసిల్‌దారును కాబట్టి వాడికేదైనా దారి చూయిస్తానేమోనని వారి ఉద్దేశం. నాకు చాలా జాలేసింది. వాడికి భార్య ముందే లేదు. ఇప్పుడు ఎదుగుతున్న కొడుకుని కళ్ళముందే పులి లాక్కుపోయింది. ఇక ఆ తండ్రి పరిస్థితి ఎలా ఉంటుంది?

రామయ్యతో పెన్షన్ కోసరం అర్జీ రాయించు కున్నాను. నెలకు అయిదు రూపాయల పెన్షన్ ఇవ్వాలని రాసి, జిల్లా అధికారికి పంపాను. పని అంత సులభంగా ఏమీ కాలేదు. రామయ్య పది నెలలు కచేరీల చుట్టూ తిరగ్గా తిరగ్గా తుదకు పెన్షన్ మంజూరయ్యింది. ఆ తర్వాత జరిగిన పరిణామం మరీ విషాదంగా ముగిసింది.

తొట్టతొలిసారిగా దొరికిన అయిదు రూపాయల పెన్షన్ నడుముకు కట్టుకుని, రామయ్య రైలు మార్గంగా ఊరికి తిరిగి వస్తున్నాడు. పూర్వం తన పిల్లవాడిని పులి ఎత్తుకపోయిన స్తంభం దగ్గరికి చేరుకోగానే అతనికి అడవిలోంచి "ఓ అయ్యా ఓ అయ్యా!! అనే అరుపులు వినిపించాయి. కొడుకు మీది బెంగతో ఉన్నాడు గనక ఆ తండ్రికి ఆ స్థలంలో అలా వినిపించడంలో ఆశ్చర్యం లేదు.

అక్కడే నిలబడి "వస్తాన కొడుకా! వస్తాన కొడుకా!!" అని రామయ్య పిచ్చిగా అరిచాడు. అలా అరుస్తూనే అడవిలోకి చొచ్చుకుపోయాడు. అప్పుడతనికి అడవిలోకి వెళ్ళొచ్చా లేదా అనే విచక్షణ లేదు. ఆ పిచ్చిలో, ఆ అడవిలో ఎంతదూరం పోయినాడో, ఏవి పాట్లు పడ్డాడో, ఏమేమి జరిగిందో మళ్ళీ వాడి ముఖం కనిపించలేదు.

రెండు మూడు రోజుల తర్వాత వాగు ఒడ్డున పులి తిని విడిచిన వాడి శరీర భాగం కనిపించింది. శవం కంట పడడం, అధికారులు రావడం, శవాన్ని గుర్తించడం అంతా జరిగిపోయింది. గుర్తింపు చేసిన సమయంలో వాడి బొడ్డున దాచుకున్న రక్తసిక్తమైన వెండి రూపాయలు బయటపడ్డాయి. అధికారులు రామయ్య వారసులకు ఇవ్వాలనుకున్నారు. సందేహచిత్తులై బంధువుల్లో ఒకడు కూడా ముందుకు రాలేదు. తుదకు అధికారులు వాడికి వారసులు ఎవరూ లేరని నిర్ధారించుకుని, డబ్బు సర్కారు ఖజానాకు తిప్పి పంపించారు. రామయ్యది దురదృష్టమో, అదృష్టమో తెలియక గ్రామస్థులు ఉదాసీనంగా ఉండిపోయారు.

***

పులుల్లాంటి ప్రభుత్వాల అజమాయిషీలో పెత్తందార్ల దోపిడిలో మగ్గిపోయిన తెలంగాణా కథకు రామయ్య కథకు పెద్దగా తేడాలేదు– అని నాకు అనిపిస్తూ ఉంటుంది.

కాని ఈ తరం పిల్లలకు ఆ విషయం అర్థం కావాలంటే ఎన్నో చారిత్రికాంశాలు చర్చిస్తూ రావాలి. పిల్లలంటే కేవలం ఇంట్లో నా మనుమలే కాదు. దేశంలోని కోట్లాది మంది యువతీయువకుల కోసం 'నాయినాపులి' కథ రాయడానికి ఉపక్రమించాను.

*